క్లుప్తంగా

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



విద్యార్థులకు మల్బరీ సాగుపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పిఠాపురం: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు అన్నారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో శనివారం సెరీకల్చర్‌కు సంబంధించి ఆన్ జాబ్స్ ట్రైనింగ్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ నెల 1 నుంచి నెలాఖరు వరకూ ఆన్ జాబ్స్ శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మల్బరీ కోత, నర్సరీ బెడ్స్ తయారీ, మార్కెటింగ్, పట్టుదారం నాణ్యత, లోపాలను తెలుసుకోవడం, చీరల తయారీ, పట్టు పురుగుల పెంపకం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులను చేబ్రోలు, ఉప్పాడ, కొత్తపల్లి, చిత్రాడలోని పరిశ్రమల సందర్శనకు తీసుకువెళతామని చెప్పారు. శిక్షణలో సెరీకల్చర్ ఉపాధ్యాయురాలు జేబీవీఎస్ఎస్ఆర్ మాధవి, బి.నాగరాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే పిల్లల ప్రగతి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం సాయి రామకృష్ణ

సామర్లకోట: తల్లిదండ్రుల సహకారంతోనే పిల్లల ప్రగతి సాధ్యమని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. విద్యార్థుల అభ్యసనలో భాగంగా శనివారం తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అర్ధ వార్షిక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తల్లిదండులకు వివరించాలని ప్రభుత్వం ఆదేశించిందని రామకృష్ణ తెలిపారు. తద్వారా వారి విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వారికి ఆయన విద్యార్థులతో ఎలా వ్యవహరించాలో వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో టాపర్లతో సెల్ఫీలు తీసుకుని ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, వి.రాజు,జి. గోవిందు, కె అరుణ, కెవీపీ సత్యనారాయణ, విద్యా కమిటీ సభ్యులు దాసరి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

సామర్లకోట: విద్యార్థి దశ నుంచి ఇంధన వనరుల వినియోగంపై అవగాహన కలిగి పొదుపుగా వాడుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఎస్‌డీఎస్ ప్రభాకరరావు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ ఉపకరణాల వినియోగం, పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. విజేతలకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా 20న బహుమతులు అందజేయనున్నట్టు విద్యుత్ ఏడీఈ కె.రాంబాబు తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ పి.రమేష్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దాపురం: మించాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆనూరు గ్రామంలో ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ తుపాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జీపీఎంసీ సేవలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

పెద్దాపురం: నిరుపేదలకు సేవలందిస్తున్న గ్లోవిన్ అసోసియేషన్ ఆఫ్ చర్చెస్ అండ్ మినిస్ట్రీస్ (జీపీఎంసీ) ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ శ్రీమంతుల చక్రవర్తి అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో శనివారం స్థానిక అరుంధతీపేట వాసులకు రగ్గులు, దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జార్జి శ్రీమంతుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో చక్రవర్తి మాట్లాడుతూ పేదలకు అండగా జీపీఎంసీ సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం సుమారు 250 మంది పేదలకు దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. పైడిమళ్ల నాగరాజు, మల్లయ్య, వల్లూరి సూర్యారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ.. నష్ట నివారణ

- భారీ వర్షాలకు నీట మునిగిన ఉద్యాన పంటలు
- సంరక్షణ చర్యలు చేపట్టిన అన్నదాతలు
- 8,200 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు



ఎఫ్‌కే పాలెంలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శైలజ



వర్షానికి దెబ్బతిన్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పిఠాపురం నియోజకవర్గంలో పండ్ల తోటలు, కూరగాయల పంటలు, అరటి తోటలు తదితర ఉద్యాన పంటలు నీట మునిగాయి. రోజుల తరబడి ముంపులో ఉండడంతో కూరగాయలు, పూల తోటలు, అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు సస్యరక్షణ చర్యల్లో బిజీగా ఉన్నారు. నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో సాగు ఇలా...

పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో సుమారు 8200 ఎకరాల్లో రైతులు మామిడి, జామ, అరటి, బొప్పాయి, పూల తోటలు, అయిల్ పామ్, కొబ్బరి, కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. తుపాను కారణంగా నీట మునిగిన పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి శైలజ సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

పొలాల్లో నీటిని తీసివేయాలి

నీట మునిగిన ఉద్యాన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిఠాపురం ఉద్యానశాఖ అధికారి శైలజ వివరించారు. కూరగాయలు, ఉద్యాన పంట పొలాల్లో నిలిచిపోయిన నీటిని సాధ్యమైనంత త్వరగా తీసి వేయాలి. అంతర సేద్యం చేపట్టి కలుపు తొలగించడమే కాకుండా నేల తడి ఆరేటట్టు చూసుకోవాలి. డీఏపీ, యూరియా వంటి పోషకాలను పంటకు వేయాలి. పొలంలో నీరు నిలవడం వల్ల ఎండు తెగులు సోకే ప్రమాదం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా మెటలాక్సిల్, మాంకోజెబ్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఆకు మచ్చ, బూజు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బెండిజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూజు తెగులు నివారణకు థైమిథోమర్ప్ 1.5 గ్రాములు లేదా మెటలాక్సిల్, మాంకోజెబ్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నియోజకవర్గంలో ఉద్యాన పంటల నష్టం వివరాలు

మండలం	పంట నష్టం (ఎకరాల్లో)
కొత్తపల్లి	27
పిఠాపురం	124
గొల్లప్రోలు	535

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



మామిడి, జీడిమామిడి, జామ, నిమ్మ, బత్తాయి, అరటి, పూలతోటలు, కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్ పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం ఉంది. తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి ఆయా మండలాల ఉద్యాన అధికారులను, గ్రామాల్లో వీహెచ్ఏలను సంప్రదించాలి. ఆయా అధికారుల సలహాలు, సూచనలను రైతులు పాటించడం ద్వారా ఉద్యాన పంటలను కాపాడుకోవచ్చు. పండ్లు, పూల తోటల ఫలసాయం సేకరణలో మెళకువలు పాటించాలి. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.

శైలజ, ఉద్యానవనశాఖ అధికారి, పిఠాపురం

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



దుర్గాడలో జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రూ.2.40 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

కొత్తపల్లి: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే కాకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలోని జల్ జీవన్ మిషన్ నిధులు రూ.2.40 కోట్లతో చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ.70 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకం పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా వారిలో 13 వేల మందికి మొదటి విడతలో ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మొగిలి అయ్యారావు, సచివాలయాల కన్వీనర్ మొగిలి సాంబశివరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ తెడ్లపు అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు

- మాండవ్య నారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలకు సన్నద్ధం
- 23న ఉత్తర ద్వార దర్శనం, గ్రామోత్సవం
- జనవరి 14న గోదా కల్యాణం




విద్యుత్ దీపాలంకరణలో మాండవ్య నారాయణుని ఆలయం

సామర్లకోట: అతి పురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి ఆలయం లో ఆదివారం నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. స్థానిక భీమవరం ప్రాంతంలోని గోదావరి తీరం తుల్యభాగ తీరాన వేంచేసి యున్న ఆలయంలో ఏటా ధనుర్మాసం నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ స్వామివారిని దర్శించి అనంతరం 10 నిమిషాలు కూర్చుంటే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని భక్తుల నమ్మకం. శనివారం ఏసీ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ అర్చకులు చక్రవర్తుల రఘురామ్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని చెప్పారు. ఆదివారం తెల్లవారు జామున స్వామికి అమ్మవార్లకు పంచామృతాల అభిషేకాలతో పూజలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఉదయం 8 గంటలకు లక్ష తులసి, శ్రీమూర్త తమలపత్ర పూజలను పెద్దాపురానికి చెందిన దాత జిగిన లక్ష్మణరావు దంపతుల సహకారంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆదివారం ఉదయం 9 గంటల నుంచి భక్త సమాజం వారిచే భజనలు, ప్రతి శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్త సంఘం సభ్యులచే విష్ణు సహస్ర నామ పారాయణం ఉంటుందన్నారు. 23వ తేదీ శనివారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారు జామున 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. అలాగే జనవరి 14న భోగి పండగను పురస్కరించుకుని ఆలయంలో గోదా కల్యాణం ఉంటుందని, దీంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయి. ధనుర్మాస పూజలను పురస్కరించు కొని ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. నెల రోజుల పాటు అభిషేకాలు, పూజలు చేయించుకునే భక్తులు ఆలయంలో సంప్రదించాలని ఏసీ నారాయణమూర్తి సూచించారు.

కొత్తపల్లి: పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్ రమణ మూర్తి శనివారం తెలిపారు. జనవరి 16వ తేదీ వరకూ స్వామివారికి ధనుర్మాస పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

కొత్తపల్లి: సామర్లకోటలో ఇటీవల జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక వీవీఎస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్ వీవీఎస్ విద్యాసంస్థలకు చెందిన డి.అభిరామ్ బంగారు పతకం, యు.జయంత్ సిల్వర్ పతకం, యు.అవినాష్ కాంస్య పతకాలు సాధించారు. కాగా శనివారం ప్రతిభ చూపిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణరావును వీవీఎస్ విద్యా సంస్థల డైరెక్టర్ అనిశెట్టి కృష్ణారెడ్డి అభినందించారు.

జేవీకే కిట్లపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్ల పట్ల మండల విద్యాశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. జగనన్న కిట్లు ఇప్పటి వరకు రోల్ ప్రకారం మండల విద్యాశాఖకు అందజేశామని, అయితే మండల విద్యాశాఖ వద్ద డేటా ప్రకారం మిగిలిపోయిన కిట్లను జాగ్రత్తగా భద్రపరచి ఉంచాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మండల విద్యా శాఖ వద్ద ఉన్న కిట్లను మినహాయించి మిగిలిన కిట్లను మాత్రమే పంపనున్నట్టు తెలిపారు. జిల్లాలో 1,59,794 మంది పిల్లలకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశామన్నారు. సామర్లకోట మండల విద్యాశాఖ కార్యాలయానికి 9,259 జేవీకే ఇచ్చామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు కిట్లతో బ్యాగ్‌లతో వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 పి.పుల్లయ్య, సీఆర్పీలు, ఎంఆర్పీలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- క్రైస్తవుల కమ్యూనిటీ భవనానికి కృషి
- క్రిస్మస్ వేడుకలల్లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సామర్లకోట 2వ వార్డులో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కోరారు. శుక్రవారం రాత్రి ఆంధ్ర బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక 2వ వార్డులో ఉన్న టీచర్సు కాలనీలో క్రైస్తవుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేయాలని విశ్రాంత ఉపాధ్యాయులు ఐఈ జీవన్‌కుమార్, బీయస్ వందనం కోరారు. దీనికి ఆయన బదులిస్తూ అధికారులతో మాట్లాడి కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడంతో పాటు క్రైస్తవ మందిరాల నిధుల నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని దొరబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ సామర్లకోటకు చెందిన విద్యావంతుడైన దొరబాబును వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం కొవ్వొత్తుల ఆరాధన ప్రారంభించి, కేక్‌ను కటింగ్ చేసి క్రిస్మస్ వేడుకలను దొరబాబు ప్రారంభించారు. టీచర్స్ కాలనీ వాసులు దొరబాబును సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటి, పిట్టా సత్యనారాయణ, ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఫాస్టర్ బి.కిరణ్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, విశ్రాంత ఉపాధ్యాయులు బీవీ రాఘవ, బి.జాన్ బాషా, ఎండీవీ ప్రసాద్, పాస్టర్లు స్టీఫెన్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతూ..

గడప గడపకూ దవులూరి పర్యటన



సామర్లకోటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పట్టణ పరిధిలో బ్రౌన్‌పేట నుంచి నాలుగు, ఆరు వార్డులలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు అక్కడి సమస్యలు వివరించగా అక్కడికక్కడే వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, పాలిక కుసుమ, జట్ల మోహన్, మర్రి శేషారావులతో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యల పరిష్కారానికే ఈ కార్యక్రమరం చేపట్టినట్టు దొరబాబు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోందని, ప్రజల చెంతకే పాలన అందించడానికి వలంటీర్, సచివాలయ వ్యవస్థలను అందుబాటులోనికి తీసుకు వచ్చారని, వారి ద్వారా ఎంతో మేలు జరుగుతోందని, అటువంటి వ్యవస్థను రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారన్నారు. పుట్టిన బిడ్డ నుంచి మలి వయసువారి వరకు ఎన్నో పథకాలు అమలవుతున్నాయని ఆయన అన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాయడు ఒక్క పథకాన్నీ అమలు చేయలేదని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, జట్ల మోహన్, గుబ్బల సత్యనారాయణ, పాగా సురేష్, పార్టీ నాయకులు జుత్తుక అప్పారావు, పాలిక చంటిబాబు, మసకపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అన్నింటా ప్రోత్సాహం

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందజేస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవిత ఐఆర్‌టీ రిసోర్సు పర్సన్ దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలందించడం ఓ వరమని, అది భవితకు దక్కడ వారి అదష్టమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జిల్లా ఐఈ కో -ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు. ఎంఈఓ ప్రభాకర శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో పాటు స్వచ్ఛంద సంస్థల చేయూత ఎంతో అవసరమన్నారు. అనంతరం మండల స్థాయిలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్లల గోవిందు, పల్లా శ్రీనివాస్ యాదవ్, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, పెంటా విజయ్‌కుమార్, భవిత ఉపాధ్యాయుడు బత్తిన ఆనందరావు, ఫిజియో థెరపిస్ట్ బి.అపర్ణ, ఐడీఎస్ఎస్ టీచర్ భవాని, సీఆర్‌పీలు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేధస్సు వెలికితీతకు వైజ్ఞానిక ప్రదర్శనలు



విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న దొరబాబు

పెద్దాపురం: విద్యార్థుల మేధస్సును వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పద్మనాభ కాలనీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఎంఈఓ ప్రభాకర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులు మరింత మక్కువ అలవర్చుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ విద్యలో రాణించినప్పుడే ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం దొరబాబు సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, విడదాసరి రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు



గోపాలకృష్ణ ద్వివేది దంపతులకు పాదగయ క్షేత్ర విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

పిఠాపురం: రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది సతీసమేతంగా శనివారం పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి పండితులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దంపతులు కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవా రు, దత్తాత్రేయ స్వామివార్లను దర్శించుకున్నారు. అర్చకులు క్షేత్రం విశిష్టతను వివరించారు. ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈవో వడ్డి శ్రీనివాసరావు వారికి పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆకట్టుకున్న బుర్రకథ

పెద్దాపురం: మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శించిన 'బుర్రకథ' ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాజమహేంద్రవరం చెందిన శ్రీరామ బుర్రకథ బృందం ప్రదర్శించిన తీరు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కోడిగుడ్డు త్రిమూర్తులు, తాడాల ప్రకాశం, బత్తుల సీతారామయ్య, చంద్రపాటి వీరబాబు, కోట శ్రీనివాసరావు, రెడ్నం కొండబాబులు ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా సుభాని జెండా పండుగ

పెద్దాపురం: స్థానిక కవాడి వీధి హజరత్ మహబూబ్ సుభాని జెండా పండుగ శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ ఆధ్వర్యంలో పుర వీధుల్లో పకీర్ల మేళా సందల్ (గంధం) ఊరేగింపు నిర్వహించారు. బ్యాండ్ మేళతాళాలతో ముస్లింలు అత్యంత భక్తిభావంతో జెండా పండుగను నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గంధోత్సవంలో భాగంగా పేదలకు వస్త్రదానం ఉంటుందని జానీ తెలిపారు.

యువతి అదృశ్యం

కొత్తపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...కోనసీమ జిల్లా మానేపల్లికి చెందిన రాయప్రోలు మౌనిక లక్ష్మీనర్సమాంబ పిఠాపురం తిమ్మరాజు వీధిలోని తన బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ నెల 12వ తేదీన పరీక్ష రాసేందుకు కాకినాడ వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి రాయప్రోలు సాయిరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీకి విధేయుడినే..

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబుతో పార్టీ నేతలు

కొత్తపల్లి: ఆవిర్భావం నుంచి పార్టీకి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తాను విధేయుడుగానే ఉన్నానని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం నియోజకవర్గం ఇన్‌చార్జిని మార్చుస్తారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ఆ పార్టీ నేతలు శనివారం పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబును కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ తనకు ఎప్పుడూ న్యాయమే చేసిందన్నారు. పార్టీ పెద్దల పిలుపు మేరకు వెళ్లి వారిని కలిశానన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలు గెలుపొందాలనే దృఢ సంకల్పంతో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయన్నారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. అప్పటి వరకూ నాయకులు ఆందోళన చెందవద్దని సూచించారు.